విడియోఫోషన్

మా ఇల్లెప్పుడూ సంతలా ఉంటుంది.

ఆ వేళ పండుగ రోజుల్లో సంతలా ఉంది

పీక్ అవర్లో సికింద్రాబాద్ స్టేషన్లా ఉంది.

డ్రాయింగ్ రూం నిండా సోఫాల్లోనూ, కుర్చీల్లోనూ, స్టూలు మీద అంతా మా మనవడు, వాడి గేంగ్.

ఎవరికీ ఇరవై ఏళ్ళు నిండలేదు.

ఎవరికీ మీసం, గెడ్డం పూర్తిగా రాలేదు.

అదిగో-ఆ సోఫాలో మా వాడి పక్కన కూర్చున్న అబ్బాయి ఆనంద్.

అతని జోళ్ళు పదిహేను వందలు

అతని షర్టు వెయ్యి పైనే.

చెవికి బంగారం రింగు.

మెళ్ళో ముత్యాల గొలుసు.

చేతికి బంగారు కడియం

జుత్తు చక్కగా పైకి ఎగదువ్వి, రబ్బరు బేండ్‌తో చిన్న పిలక వేసుకున్నాడు.

పేంట్, షర్టు తీసేసి జరీ కండువా, పంచ కడితే రాయల కాలం నాటి పురోహితుడిలా ఉన్నాడు. ఈ జుత్తు బాధ పడలేక అప్పుడప్పుడు నాకు మొగాళ్ళలాగా క్రాపు చేయించుకుంటే ఎంత హాయిగా ఉంటుందో అనిపిస్తుందే!

మరి ఈ మగపిల్లల కీ పిలక వ్యామోహం ఏమిటో!

ఇదంతా స్టార్ టి.వి. మహత్యం.

ఇంతకీ ఈ సంత గోల ఎందుకో?

ఏంవిటి ఆ స్పెషల్ ఎట్రాక్షన్?

అదే అడిగేను మా వాడిని "ఏంవిటిరా సంగతి" అని.

మరేంలేదు వీడియో ఫేషన్ షో అట.

ఏ "షో" అయినా నాకు ఒకటే.

కాకపోతే మా వారు ఇంట్లోనే ఉన్నారు. ఇంత గోల ఆయనకి నచ్చదు.

గోల చెయ్యొద్దంటే వీడికి నచ్చదు.

కరవమంటే కప్పక్కోపం, విడవమంటే పావుక్కోపం.

మరంచేత మా వాడ్ని పక్కగదిలోకి పిల్చి "వీళ్ళెవరికీ టి.వి.లు లేవేవిట్రా?" అనడిగేను, వాడిక్కోపం రానంత నెమ్మదిగా. కాని, నా అంచనా తప్పు.

వాడిక్కోపం సర్రున వచ్చేసింది.

"వాళ్ళేం ముష్టి వెధవలనుకున్నావా? (నువ్వు ముష్టి వాళ్ళతో ఫ్రెండ్షిప్ చేస్తావని నేను కలలో కూడా నమ్మనురా అబ్బీ!) అందరికీ ఫారెన్ టి.వి.లున్నాయి మనింటికొచ్చి ఈ ముష్టి టి.వి. చూడాల్సిన ఖర్మ వాళ్ళకేం పట్టలేదు" అని కస్సుమన్నాడు.

"మరిప్పుడెందుకు పట్టిందో?"

"ఏంవిటి?"

"ఖర్మ!"

"నీ చిన్నప్పుడు టీ.వీ.ల్లేవుకదా! అంచేత నీకు చెప్పినా అర్థం కాదులే" వెధవ వ్యంగ్యం నవ్వొకటి.

నాకూ కోపం ఎక్కువే.

కాకపోతే ఆడదాని కోపం అసలుకే మోసం.

అంచేత "పోనీ నాకు అర్థం అయ్యే భాషలోనే చెప్పొచ్చుకదా?" వీలైనంత శాంతంగానే అన్నాను.

"కొన్ని ప్రోగ్రామ్స్ అందరం కలిసి చూస్తేనే ఎంజాయ్ చేస్తాం."

"గాంగ్ రేప్లాగ?"

తుళ్ళిపడ్డాడు గాడిద.

"అమ్మా, నీకు సున్నితంగా మాట్లాడ్డం రాదా?"

"రాదు. నన్నేం చెయ్యమంటావు? నా జాతకంలో సున్నితమైన గ్రహాలేం లేవుట. పైగా, వాక్ స్థానంలో శని ఉన్నాడు. మరింక నా భాషే అంత" అంటూ ఓ కుర్చీలో కూలబడ్డాను.

"నువ్వూ చూస్తావా?" వాడి మొహంలో ఆశ్చర్యంకంటే విసుగు ఎక్కువ కనిపించింది.

ఔను మరి. నేనుంటే వాళ్ళు ఫ్రీగా కామెంట్ చేసుకోలేరు. నాకు మాత్రం ఈ ప్రోగ్రాములు ఇష్టవాఁ! కాని, అప్పుడప్పుడు ఇలాంటి శిక్షలు భరించక తప్పదు మరి. కారణం – మావారు ఆఫీసు గదిలో ఉన్నారు. గాలివానలాంటివి వార్నింగు ఇచ్చి మరీ వస్తాయి. కాని, మావారు భూకంపంలా విదౌట్ వార్నింగ్ వస్తారు. మరి ఆయన్ని కొంచెం సాఫ్ట్‌డౌన్ చెయ్యాలంటే నేనుండక తప్పదు.

"నేను చూడకూడనివి ఏం లేవులే" అన్నాను, టేబిల్ మీదున్న పుస్తకం తీస్తూ.

నేను భయపడ్డ భూకంపం రానే వచ్చింది.

"ఏవిఁటి? ఇక్కడేదో సమ్మిట్ కాన్ఫరెన్సు జరుగుతోంది. నేను రావచ్చా?" అంటూ మావారొచ్చి నా పక్కనే కూర్చున్నారు.

అప్పుడు చూడాలి వాళ్ళందరి మొహాలు.

అందరి తల్లిదండ్రులు ఒక్కసారే పోయినట్టు అతి దీనంగా పెట్టేరు మొహాలు. పోనీ, మరో ఇంటికి పోదామంటే టైములేదు. ప్రోగ్రాం ప్రారంభించడానికి మూడు నిముషాలే ఉంది.

ఆ మూడు నిముషాలూ శ్మశాన నిశ్శబ్దం.

పిన్ డ్రాప్ సైలెన్స్ అన్నమాట నాకు అప్పుడే అర్థమైంది.

నాలుగో నిమిషం...

ప్రోగ్రాం ప్రారంభమైంది.

స్టేజి, సెట్ అంతా బ్రహ్మాండంగా ఉంది.

అంత అద్భుతమైన ఫోటోగ్రఫీకి జోహార్లే.

మ్యూజిక్ కూడా వినబుల్‌గానే ఉంది.

తెరలోంచి ఇద్దరమ్మాయిలు వచ్చేరు.

"వీళ్ళు అమ్మాయిలేంవిఁటి? ప్రౌఢలే. వాళ్లకి లైఫ్ బిగిన్స్ ఎట్ ఫార్టీకాని మనకి లైఫ్ ఎండ్స్ ఎట్ ఫార్టీ. మరంచేత వీళ్ళు ప్రౌఢలే..." మావారి కామెంట్.

ఇద్దరమ్మాయిలూ గెడకర్రల్లా ఉన్నారు. చెరో పక్క నిలబెట్టి తాడుకట్టి బట్టలారేసుకోవచ్చు.

"ఈ గుంటలేంవిఁటి ఇలా ఉన్నారు? స్లిమ్‌గా ఉండడం ఫేషనేమో కాని సరసానికి మాత్రం బావుండదు. ఏవంటావు?" మావారి గుసగుస.

"కాసేపు మాట్లాడొద్దంటాను." విసుక్కున్నాను.

స్టేజిమీద అమ్మాయిలు హొయలు ఒలకబోస్తూ నడుస్తున్నారు.

ఒకమ్మాయి గుండెలమీద ఓ వెడల్పు రిబ్బనంత గుడ్డముక్క కప్పుకొని వీపుమీద ముడేసుకుంది బేండేజి వేసుకున్నట్టు.

మొలమీద మూరెడు గుడ్డ చుట్టబెట్టుకుంది. అంత చిన్న గుడ్డ పడిపోకుండా ఏం చేసిందో తెలీలేదు.

రెండో అమ్మాయి గుండెలమీద ఏం వేసుకోలేదు. వరసగా పూసల దండలు పేర్చుకుంది.

వీపంతా ఖాళీ.

మూడేళ్ళ పిల్లకి సరిపోయే లాగు తొడుక్కుంది. ఆ లాగు నిండా పూసలు, గవ్వలు మువ్వలు.

ఆ పిల్ల ఆ పూసలు కదలకుండా సర్కస్‌లో వైరుమీద నడిచినట్టు అతి లాఘవంగా నడుస్తోంది.

భుజాలమీద తెల్లటి దేవతా వస్త్రం లాంటిది వేలాడుతోంది.

"దాన్ని 'సీ-త్రూ' అంటారు" గొణిగేడు ఆ గాంగ్‌లో ఒకడు.

మా వారివి పాముఁ చెవులు. విననే విన్నారు.

"ఆ రెండో అమ్మాయి గో..." అంటున్న మావారి నోరు ఠక్కున మూసేసేను.

"ఆ బొడ్డూడని గుంటడికి లేని సెన్సారు నాకేవిఁటి? డోన్ట్ బి సిల్లీ" అని అంత ఠక్కున నా చేయి తోసేశారు.

భగవాన్! భగవద్గీత బోధించి కురుక్షేత్రం చేయించేవు. ఏ గీత బోధిస్తావో కాని ఈ కురుక్షేత్రం ఆపించు.

నా వెర్రిగాని అది పురాణయుగం కాబట్టి భగవంతుడి మాట చెల్లింది.

ఈ యుగంలో చెల్లదు.

నా అదృష్టం బావుండి ఆ అమ్మాయిలు వెళ్ళిపోయేరు.

ఈసారి మరో ఇద్దరమ్మాయిలు, ఒక అబ్బాయి వచ్చేరు

అబ్బాయిలు పాపం ఒంటి నిండా బట్టలు కట్టుకున్నారు.

ఒక అమ్మాయి బట్టలు ఉండవలసిన చోట్లలో రంగుల్తో పువ్వులు, లతలు పెయింట్ వేయించుకుంది.

రెండో అమ్మాయి ఒళ్ళంతా అరంగుళం జాగా లేకుండా రంగులు వేయించుకుంది.

"వీళ్ళిద్దరూ చెట్లకి మనిషి బుర్రలు కాసినట్లున్నారు. పాపం! ఎవడు వేశాడో కాని ఆ ఆర్టిస్టు – ఐ రియల్లీ పిటీ హిమ్." గొణిగేరు మావారు.

అందరమ్మాయిలు కొంచెం తేడాతో అదే వేషం. అందరూ రావడం, కాస్సేపు వీపు, కడుపు చూపించడం. వానావానా చల్లప్ప తిరగడం. వెళ్ళిపోవడం.

ఇంతలో వీధిలో ఎవరో పిలిచినట్లైంది.

"ఎవరో చూడు" మావారు మనవడ్ని పురమాయించేరు.

వాడు విసుక్కుంటూనే వెళ్ళి తలుపు తీశేడు.

ఒక్క నిమిషం ఆగి ధబ్‌మని తలుపేశేడు "ఛీ! ఛీ!!" అంటూ

"ఎవర్రా?"

"ఎవరో ముష్టిది?"

"దానికంత విసుగెందుకూ? పిడికెడు బియ్యమో, డబ్బో ఇచ్చి పంపించవచ్చు కదా?" మావారూ విసుక్కున్నారు.

నేను లేచి వెళ్ళేను.

గుమ్మంలో ఒకమ్మాయి నిల్చుంది.

ఒక్క నిమిషం మెరుపు మెరిసినట్లైంది.

ఎవరీవిడ?

ఇంద్రలోకంలో నుండి జారిపడిన అప్సరసా?

దారితప్పిన గంధర్వకన్యా?

దుష్యంతుడి శకుంతలా?

ప్రవరుడి వరూధినా?

ఏ మునీశ్వరుడి శాపంవల్లో భూమ్మీదకొచ్చిన దేవతా కన్యా?

ఏఁవిఁటీ అందం?

ఏ ఏడ్ ఏజెన్సీవాడో చూస్తే ఎగరేసుకుపోడూ!

వయసు పాతిక మించదు.

ఈ అమ్మాయి కూడా గుండెలమీద ఓ తువ్వాలంత గుడ్డ కప్పుకుంది. నడుముకి మరో తువ్వాలంత గుడ్డ చుట్టుకుంది. ఓ చేతిలో చంటిపిల్ల, ఆ పిల్ల తువ్వాలులో తలదూర్చి తల్లి దగ్గర పాలు తాగుతోంది. తలుపు చప్పుడుకి కాబోలు తల బైటపెట్టి చూసి పలకరింపుగా ఓ చిరునవ్వు విసిరి మళ్ళీ తల దూర్చేసింది.

గబుక్కున లోపలికి వెళ్ళి ఓ పాత చీర, రెండు గౌన్లు తెచ్చి ఇచ్చేను.

దణ్ణం పెట్టి వెళ్ళిపోయింది.

లోపలికి రాగానే "ఎందుకమ్మా చీర ఇచ్చేవు?" అని నిలేశాడు మా మనవఁడు.

"మీకు తెలీదు ఆంటీ! వీళ్ళకి బట్టలు లేక్కాదు. మనం జాలి పడతాఁవని అలా వేషాలేస్తారు. మనం ఇచ్చిన బట్టలన్నీ అమ్మేస్తారుట" అన్నాడు ఆ గేంగ్‌లో ఒకడు. వాడెప్పుడూ తల పైకీ, కిందకీ అచ్చు తొండలా ఆడిస్తాడు. పైగా, మొహం కూడా కొంచెం కోలగా తొండ మొహంలాగే ఉంటుంది. మేము వాడ్ని "తొండ" అనే అంటాం. వాడిలోవున్న గొప్పతనం ఏవిఁటంటే వాడేం ఫీలవడు.

నాకు బాగా చిర్రెత్తుకొచ్చింది.

పేంటు తొడగ్గానే పెద్దవాళ్ళమైపోయా వఁనుకుంటారు. అనుకుంటే ఫరవాలేదు.

అన్నీ వాళ్ళకే తెలుసనీ, పెద్దవాళ్ళు ఒట్టి ఫూల్సనీ కూడా అనుకుంటారు.

ఈ గాడిదలకి ఒక గుణపాఠం చెప్పాలి.

నేనెందుకూ?

ఓ చిన్న సమిధ విసిరేస్తే మావారు హోమం అయిపోరూ!

"ఒరే లల్లూ! ఈ ఫేషన్ షో అమ్మాయిలు కూడా పాపం, మన జాలి కోసమే అలా చేస్తున్నారంటావా?" ఒక సమిధ విసిరేను.

"ఛీ! వాళ్ళకి మన జాలి ఎందుకూ? బోలెడు బట్టలుంటాయి వాళ్ళకి" అన్నాడు మావాడు.

"ఈ ఫేషన్ షోలలో పార్టిసిపేట్ చేసినందుకు వాళ్ళకి లక్షలిస్తారు" అన్నాడు ఆ 'తొండ' కుర్రాడు తల పైకీ, కిందికీ ఆడిస్తూ.

"జాలికోసం కాదు, బట్టల్లేకా కాదు – మరెందుకు విప్పేసుకుంటున్నార్రా వీళ్లు?" రెండో సమిధ విసిరేను. "డబ్బుకోసవేఁ కదా?" అని కూడా కలిపేను.

"అబ్బా! నీకు తెలీదు. ఒకరు చెప్తే వినవు. అసలు ఈ షోలలో తీసుకోవడవేఁ ఓ ప్రిస్టేజి." వివరించేడు మావాడు.

"ప్రిస్టేజికి ఎంత మంచి అర్థం చెప్పేడో విన్నావా?" మావారి మొహంలో నేను విసిరిన సమిధలు కనిపిస్తున్నాయి.

"ఒరే లల్లూ...నాకు తెలీకడుగుతానూ...తెలీకేలే...ఔట్ ఆఫ్ షీర్ ఇగ్నోరెన్స్ (మావారి క్కోపం ఎప్పుడూ ఇంగ్లీషులోనే వస్తుంది) – మరి మా చిన్నప్పుడు ఈ.టీ.వీ.లు వగైరాల్లేవు కదా..." ఎఫెక్టుకోసం ఆగేరు.

ఎఫెక్టు రావలసినదానికంటె ఎక్కువగానే వచ్చింది.

గేంగ్ అంతా గజం బద్దల్లా నిటారుగా సాగేరు.

అందరి మొహాల్లోనూ టెన్షన్.

మర్డరుకేసు జడ్జిమెంటునాటి ముద్దాయిల్లా ఉన్నారు.

"ఈ అమ్మాయిలు డబ్బుకోసవేఁ...ఐ మీన్ ఏజ్ ఎ ప్రొఫెషన్...కేవలం డబ్బుకోసవేఁ ఇలా గుడ్డలిప్పేసుకుంటున్నారు...అంతేనా?"

"విప్పేకోవడం లేదు." మా మనవఁడు సరిదిద్దబోయేడు.

"సరే...సరే...ఐయామ్ సారీ...వెరీవెరీ సారీ...విప్పేకోవటం లేదు అన్నది తప్పు ప్రయోగం. యు ఆర్ రైట్. టు బి ప్రిసైజ్ కట్టుకోవడం లేదు..." అగ్నిహోత్రం అంటుకుంది. ఈ నిప్పు ఇంక చల్లారదు.

"అబ్బ ఏమిటి నాన్నా! ఇది కోర్టుకాదు. క్రాస్ ఎగ్జామిన్ చెయ్యడానికి, ఏదో సరదాగా టి.వి. చూద్దామంటే పేద్ద రాద్ధాంతం..." లేవబోయేడు.

అంతవరకు కూర్చున్న మావారు లేచి నిల్చుని సిగరెట్ అంటించేరు. అంటే కొంచెం సీరియస్‌గానే ఉన్నారన్నమాట!

ఆయన మా వాడి దగ్గరకెళ్ళి భుజం మీద చెయ్యేసి కూర్చో బెట్టేరు..."కూర్చో, కూర్చో. రాద్ధాంతంకాదు– సిద్ధాంతం. ఇది కోర్టుకాదని నాకు జ్ఞాపకం చేసినందుకు థేంక్స్. యువర్ ఎప్రోచ్ టువర్డ్స్ లైఫ్... అంటే తెలుగులో ఏమంటారే అమ్మీ...జీవితంపట్ల నీ దృక్పథం...అదీ తప్పని చెప్పటం..."

ఫ్రెండ్స్ ముందు అలా పాఠాలు చెప్పించుకోవటం వాడికి సుతరామూ ఇష్టంలేదు.

"పోనీ, తరవాత చెప్పొచ్చుకదా?" అని వాడి బాధ.

మరే! తప్పుచేసిన ఆర్నెల్లకీ, నీకు జ్ఞాపకం వచ్చినప్పుడు, వాడికి తీరిక దొరికినప్పుడూ కాదు. ఏ తప్పైనా వెంటనే దిద్దకపోతే, ఆ తప్పు పెద్దవాళ్ళది అన్నది మావారి థియరీ.

వాడి ఫ్రెండ్సుకీ ఇబ్బందిగానే ఉంది. అంచేత వెళ్ళడానికి లేవబోయేరు.

ఆడియన్స్ లేకపోతే మావారికి మూడ్ రాదు.

"కూర్చోండి...కూర్చోండి..."

అందరూ ముళ్ళకుప్పలమీద కూర్చున్నట్టు కూర్చున్నారు.

"మిమ్మల్ని ఫేషన్ షోలు చూడొద్దని చెప్పను. న్యూడ్ షోలు కూడా చూడండి. ఆ వయసు అటువంటిది. అంతా మంచే చూస్తే చెడు ఎలా తెలుస్తుంది? చెడు చూడాలి, దాన్నుండి ఒక పాఠం నేర్చుకోవాలి. ఏమంటారు?"

ఔనన్నట్టు అందరూ తలాడించేరు.

"ఆ ఫేషన్ షోలలో అలా గుడ్డలిప్పుకున్నందుకు–ఐయామ్ సారీ... కట్టుకోనందుకు వాళ్ళకి ఏమాత్రం ముట్టచెప్తారు?"

ఎవరూ మాట్లాడలేదు.

"లక్షలమీదే ఉంటుందనుకుంటాను. మరి మీరు ఈ ముష్టిదానికి రూపాయైనా ఇవ్వరే? ఏం? గ్లామర్! అంతే. ఇదే అమ్మాయిని ఏ నాలాటివాడో చేరదీసి మేకప్ వేసి ఫాషన్‌షోకి పంపిస్తే మీరే ఎగబడతారు. ఆ అమ్మాయిలకి బీరువాలనిండా బట్టలుంటాయి, కాని, అవి కట్టుకుంటే వాళ్ళకి డబ్బురాదు. అంచేత గుడ్డలిప్పుకొని డబ్బు సంపాదించి, ఆ డబ్బుతో మళ్ళీ కొనుక్కుంటారు. 'ఈజీమనీ' కావాలి ప్రతివాడికి కష్టపడి, ఒళ్ళువంచి పని చెయ్యడం ఎవ్వరికీ ఇష్టంలేదు."

ఇంతకీ నేను లెక్చరు ఇవ్వదల్చుకోలేదు. ఒళ్ళుకొవ్వి గుడ్డలిప్పుకొని గెంతినవాళ్ళకి వహ్వా కొట్టి, గతిలేక వంటిమీద బట్టల్లేనివాళ్ళని చీదరించుకోకండి."

"లేమి తప్పుకాదు. పాపం అంతకంటే కాదు. కేవలం పరిస్థితుల ప్రభావం అంతే. అవకాశాలు లేకపోవడం. వాళ్ళు ఆ పరిస్థితుల్లో ఉన్నారంటే ఆ తప్పు వాళ్ళది కాదు. వాళ్ళని అలా ఉంచిన మనది. ఆ పరిస్థితులకి సిగ్గు పడాల్సింది వాళ్ళుకాదు–మనం. అర్థమైందా?" అందరూ బుర్రలు ఊపేరు.

వెంటనే బతుకు జీవుడా అని బైటకి పారిపోయేరు.

ఏది ఏమైనా మళ్ళీ మా ఇంట్లో వీడియో ఫాషన్ ప్రోగ్రాం పెట్టలేదు.

కురుక్షేత్రం ఇంత శాంతియుతంగా సాగినందుకు నేను మావారికి థేంక్స్ చెప్పకతప్పదు.

("కొత్తకథ" కథా సంకలనం, నవంబరు, 1994)

★ ★ ★